ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణికుముదిని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీపై కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ కరుణాకర్ పాల్గొన్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిందని, సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనుకుంటే, ప్రతి ఫేజ్‌లో ఏ మండలాల్లో ఎన్నికలు జరగాలో జిల్లా వారీగా ప్రణాళిక అందించాలన్నారు. పాత పద్ధతిలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని, సెప్టెంబర్ 2న విడుదల చేసిన పంచాయతీ తుది ఓటర్ జాబితా సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి ఈనెల 22లోపు పరిష్కరించాలన్నారు. 23న ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫొటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణ పూర్తి కావాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసీసీ నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనపై వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి యంత్రాంగం సిద్ధం చేసుకోవాలన్నారు. జడ్పీ సీఈఓ నరేందర్, డీపీవో వీర బుచ్చయ్య, ఏసీపీలు రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

కార్యాలయాలన్నీ ఒకే చోట



ఇంటిగ్రేటేడ్ భవనం నిర్మించే స్థలం

- డివిజనల్ ఇంటిగ్రేటేడ్ బిల్డింగ్ నిర్మాణానికి శ్రీకారం
- ఆర్డీవో, తహసీల్దార్ ఆఫీసులు ఇతర భవనాల్లోకి తరలింపు
- పాత భవనాలు కూల్చివేసి, మరింత స్థలంతో భవన నిర్మాణం
- రూ.4.50 కోట్లతో జీప్లస్-2 బిల్డింగ్ నమునా
- భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్‌లోని ప్రజలందరికి త్వరలోనే వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు పలు ప్రభుత్వ శాఖల్లో వివిధ పనుల నిమిత్తం రోజుల తరబడి వేర్వేరు కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగి ఇబ్బందులు పడుతున్నారు. మంథని డివిజన్ కేంద్రంగా ఏర్పాటై దాదాపు 40 ఏళ్లు గడిచిన



ప్రజలకు సమాచారం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఇప్పటి వరకు డివిజన్ స్థాయిలో ఒకే చోట కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. ఇప్పటికి పలు ప్రభుత్వ శాఖలకు డివిజన్ మండల స్థాయిలో సొంత భవనాలు లేవు. ఉన్న వాటిలో చాలా వరకు శిథిలావస్థలకు చేరుకున్నాయి. అరకొర వసతులతో ఇటు అధికారులు, సిబ్బంది, అటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ స్థాయి సమీకృత భవన సముదాయ నిర్మాణం పూర్తయితే ఈ ఇబ్బం దులు తప్పనున్నాయి.

కార్యాలయాలకు సొంత భవనాలు కరువు..

భవనాలు నిర్మించాల్సిన ఆర్అండ్‌బీ డివిజన్ స్థాయి కార్యాలయాన్ని ఆశాఖ గెస్టుహౌజ్‌లో ఏర్పాటు చేశారు. అగ్రికల్చర్ ఏడీఏ ఆఫీసును మండల పరిషత్ కార్యా లయ గెస్టుహౌజ్‌లో నిర్వహిస్తున్నారు. ఐబీ డీఈ ఆఫీసును మహిళా భవనంలో నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయాన్ని మండల పరిషత్‌లోని గోదాం షెటర్ నిర్వహిస్తున్నారు. ఐబీ ఈఈ ఆఫీసును రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీలో సింగరేణి భవనంలోకి తరలించారు. లేబర్ ఆఫీసు, ఏఎస్‌డబ్ల్యూవో ఆఫీసులు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇలా అనేక ప్రభుత్వ కార్యా లయాలకు సొంత భవనాలు లేక, ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటు కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, పనుల నిమిత్తం వెళ్ళే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి మంత్రి చొరవ..

కలెక్టరేట్ భవన నిర్మాణం మాదిరిగా ఇంటిగ్రేటెడ్ భవన నిర్మానానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరవ చూపారు. అన్ని ప్రభుత్వ కార్యాల యాలన్ని ఒకే చోట ప్రజలకు పరిపాలన పరంగా సేవలు అందించే విధంగా ఆలోచన చేశారు. ప్రస్తుతం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు, గతంలో పాత ఆర్డీవో ఆఫీసు ఉన్న పాత స్థలం కలుపుకొని ఒకే చోట డివిజనల్ స్థాయి ఇంటిగ్రేటెడ్

మిగతా 8వ పేజీలో..

ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు ఖాళీ..

ప్రస్తుతం ఉన్న ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను బుధవారం ఖాళీ చేశారు. ఆర్డీవో ఆఫీసును బస్ డిపో సమీపంలోని ప్రైవేట్ భవనంలోకి తరలించారు. తహసీ ల్దార్ కార్యాలయాన్ని స్థానిక ఇంటిగ్రేటెడ్ ఎస్సీ హాస్టల్ లోని ఫస్ట్‌ఫ్లోర్‌కి మార్చారు. ఈ మేరకు రెండు ఆఫీసు ల్లోని సామగ్రిని తరలించారు. ఆర్డీవో ఆఫీసును సైతం ఇదే హాస్టల్‌లోని సెకండ్ ఫ్లోర్‌లోకి మార్చాలని అధికా రులు అనుకున్నప్పటికీ అనివార్య కారణాలతో ప్రైవేట్ బిల్డింగ్‌లోకి తరలించారు. ఇక నుంచి ప్రజలకు పాలన పరంగా రెవెన్యూ అధికారులు సేవలందించనున్నారు.

సుందిళ్లలో ఘనంగా గోదావరి మహా హారతి



గోదావరి నదికి హారతి ఇస్తున్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సుందిళ్ల గోదావరి నదీ తీరాన గురువారం గోదావరి హారతి నిర్వహించారు. ఉదయం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు జయంత్ శర్మ వేద మంత్రోచ్చా రణల మధ్య ఆకాశ దీప ఆరోహణ జరిగింది. సాయంత్రం నది ఒడ్డున మహాహారతి ఇచ్చారు. గోదావరికి పువ్వులు, పండ్లు చీర సారె, పసుపు కుంకుమ సమర్పించారు. వేద మంత్రాల మధ్య పంచహారతి, కర్పూర హారతి నక్షత్ర హారతి ఇచ్చారు. ఉత్సవ సమితి కార్యదర్శి క్యాతం వెంకటరమణ మాట్లాడారు. నదీ జలాలను పూజించడం రుగ్వేద కాలం నుంచి ఉన్నదని తెలిపారు. సకల జీవరాశులకు జలం ఆధారమని పేర్కొన్నారు. గ్రామస్థులు కొరకొప్పుల సత్యనారాయణ, సత్యవతిగౌడ్, గుండ రమేష్, కాశిక శర్మ, శ్యామల, రవి, రాజేష్, మోహన్, పుష్పలత, నాగరాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీస్

కోల్‌సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో ఆస్తి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసినట్లు నగర కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ఈ నోటీసులను హెచ్చరికగా భావించి వెంటనే పన్నులు చెల్లించకుంటే బకాయిదారుల నివాసాలకు మున్సిపల్ సేవలు నిలిపివేయడంతో పాటు ఆస్తులు కూడా జప్తు చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఆస్తి పన్ను బకాయిదారులు రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు, మీ సేవాకేంద్రాలు, ఆన్‌లైన్‌లలో చెల్లించవచ్చునన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుకు సంబంధించి బకాయిలు ఈ నెలాఖరులోగా చెల్లిస్తే అపరాధ రుసుము ఉండదని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొనుగోలు కేంద్రంలో జేసీ విచారణ

- కాంటాలో సాంకేతిక లోపం
- వీవో సస్పెన్షన్

ఓదెల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం అదనపు కలెక్టర్ వేణు సందర్శించారు. ఎలక్ట్రిక్ కాంటాలో లోపంపై విచారణ నిర్వహించారు. కాంటాపై బస్తా తూకం వేయగా తక్కువ బరువు చూపించడంతో రైతులు నష్టపోయారు. దీంతో అదనపు కలెక్టర్ బాధిత రైతును వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలోని కాంటాలో ఉన్న లోపం తెలుసుకొని వీవో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించారు. దీంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు పెండెం లక్ష్మిని సస్పెండ్ చేస్తూ అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రోజు



కనగర్తి ఐకేపీ కేంద్రంలో విచారిస్తున్న జేసీ వేణు

కాంటాలను ఎందుకు తనిఖీ చేయలేదని, నిర్లక్ష్యం వహించినందుకు తొలగింపునకు అనివార్యమైంది. తూనికల కొలతల అధికారులు సాంకేతిక లోపం ఉన్న కాంటాను స్వాధీనం చేసుకొని వెంట తీసుకెళ్లారు. అలాగే కొనుగోలు కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా 41 కిలోల 200 గ్రాముల తూకం వేస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇక నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 41 కిలోలు మాత్రమే ధాన్యం తూకం వేయాలని, ఏ కేంద్రంలోనైనా గ్రాములు ధాన్యం తూకం వేయవద్దని సెర్ప్ ఏపీఎంను ఆదేశించారు. జేసీ వెంట తహసీల్దార్ ధీరజ్ కుమార్, ఏపీఎం సంపత్ లు ఉన్నారు.

త్వరలో అందుబాటులోకి జిరియాట్రిక్ వార్డు



గర్రెపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సుల్తానాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిరియాట్రిక్ వార్డు త్వరలో అందుబాటులోకి వస్తుందని జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ అన్నారు. వయసు పైబడిన, బెడ్ రిడెన్ పేషెంట్లకు ఈ సేవల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సుల్తానాబాద్ మార్కండేయ కాలనీ వద్ద నిర్వహిస్తున్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్, జిల్లా వ్యాక్సిన్ స్టోర్‌ను పరిశీలించారు. అక్కడ మందుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. మెడిసిన్ వ్యాక్సిన్ పంపిణీ విధానాలను సమీక్షించి, ఇండెంట్ మేరకు అన్ని ఆరోగ్య కేంద్రాలకు మందులను సరఫరా చేయాలన్నారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. ప్రతి నెలా ఎఆర్‌వీ వ్యాక్సిన్ ప్రతీ ఆరోగ్య కేంద్రంలో స్టాక్ ఉండాలని ఆదేశించారు. క్యాన్సర్ నిర్ధారణ అయి, చికిత్స పొందుతున్న పేషెంట్లకు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఫాలోఅప్ సేవలు, మందులు పంపిణీ చేస్తామని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పూసాల రోడ్డులోని అమృత చిల్డ్రన్స్ ఆసుపత్రిని పరిశీలించి ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడారు. కేవలం క్లినిక్ సేవలకు మాత్రమే ఉండాలని, అడ్మిషన్‌లు చేయరాదని తెలిపారు. వైద్యాధికారి లక్ష్మిభవాని, అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పుస్తకాలే ప్రియ నేస్తాలని, విద్య అనేది గొప్ప ఆయుధమని, గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రంథాలయ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.1.50 కోట్ల నిధులతో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రంథాలయ చైర్మన్ ఎమ్మెల్యేను సన్మానించి నిప్పుల వాగు పుస్తకాన్ని బహూకరించారు. వారం రోజులుగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. రాబోయే 30 ఏళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అర్అండ్‌టీ అధికారులతో మాట్లాడి, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి 12 గుంటల స్థలాన్ని కేటాయించి, రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. సంవత్సరంలోగా భవన నిర్మాణం పూర్తి చేసుకుంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, ఎంఈఓ సురేందర్ కుమార్, మాజీ కౌన్సిలర్లు, గ్రంథాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఏడు నెలలుగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును వెంటనే పునరుద్ధరణ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం అలసత్వంతో యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, దీంతో అశాంతి నెలకొంటుందన్నారు. కార్మికులు అనారోగ్యానికి గురై మెడికల్ బోర్డు పెట్టుకుంటే ఇప్పటి వరకు పిలువక పోవడంతో అప్పుల పాలవుతున్నారని, రెండు సంవత్సరాల పైబడి సర్వీస్ ఉన్నప్పుడు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు రిటైర్డ్ సమయం దగ్గర పడుతుందని, వారిని మెడికల్ బోర్డుకు పిలువకపోవడంతో కృంగిపోతున్నారని ఆరోపించారు. కార్మికులు డ్యూటీలు చేయకపోతే కౌన్సెలింగ్ పేరిట భార్య పిల్లలను తీసుకురావాలని నోటీసులు ఇవ్వడం హేయమైన చర్య అని, అండర్ గ్రౌండ్‌లో నెలకు 16మస్టర్లు, సర్ఫేస్‌లో 19మస్టర్ల నిబంధనలు విధించడం సరికాదని, ఈ సర్క్యూలర్‌ను విరమించుకోవాలని, 150మస్టర్ల నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఓపెన్‌కాస్టు బ్లాస్టింగ్‌లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీనిని యాజమాన్యం నివారించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు మేదరి సారయ్య, వెంకటస్వామి, రాజమౌళి, శ్రీహరి, మల్లేష్, చంద్రశేఖర్, సదానందం పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

అంతర్గాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నదని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోనే రైతాంగానికి రెండు పంటలకు నీరందించేలా ఎల్లంపల్లి వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రామగుండం నియోజకవర్గ రైతులు సాగునీటికి అనేక ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగు, తాగునీటికి కొరత లేదన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గుండెపోటుతో మృతి చెందిన ఎక్లాస్‌పూర్‌లోని తూడూరి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు పెండ్యాల మహేష్, పూదరి సత్తయ్య గౌడ్, లగిశెట్టి రాకేష్, గాదె సుధాకర్, పెంద్రు హనుమాన్ రెడ్డి, ముక్కెర శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

రేపు క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఈనెల 22న ఎంపిక చేయనున్నట్టు సెలెక్టర్లు కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డిలు ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అబ్దుల్ కలాం స్టేడియంలో పెద్దపల్లి జట్టును ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. 23 ఏళ్ళ లోపు క్రికెటర్లు అర్హులని, వయస్సు ధృవీకరణ పత్రం, క్రికెట్ కిట్‌ను తీసుకుని రావాలని సూచించారు.

ప్రైవేట్ ఆసుపత్రులు బ్రాండెడ్ మెడిసిన్ దందా



- వెలవెలబోతున్న జనరిక్ మందుల షాపులు
- పర్సంటేజీల కోసం డాక్టర్ల తండ్లాట

పెద్దపల్లిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు బ్రాండెడ్ మందుల పేరుతో రోగులను నిండా ముంచుతున్నారు. మందుల కంపెనీలతో డాక్టర్లు కుమ్మక్కయి పర్సంటేజీల కోసం బ్రాండెడ్ మందులను రాస్తున్నారు. జనరిక్ మందులపై రోగులకు అవగాహన కల్పించి వాటిని వాడేలా చేయాల్సిన డాక్టర్లే వాటిని రాయడం లేదు. దీంతో ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపులు నడవడం లేదు. దీంతో పలు జనరిక్ మందుల షాపులు మూసివేసే దశలో ఉన్నాయి. జనరిక్ మందులకు, బ్రాండెడ్ మందులకు ధరలో చాలా వ్యత్యాసం ఉంది.

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు తమ వద్దకు వచ్చిన రోగులకు ఆస్పత్రి ఆవరణలో దొరికే మందులు రాస్తున్నారు. జనరిక్ మందులు గురించి తెలుపకుండా రోగుల నుంచి తమ మందులను కొనిపిస్తే ఆయా డాక్టర్‌కు ఫార్మా కంపెనీలు, మందుల షాపుల నుంచి కమీషన్ తీసుకోవడం ఆనవాయితీగా మారింది. అందువల్ల నర్సింగ్ హోంలు, ప్రైవేటు క్లినిక్‌లు , కార్పొరేట్ ఆసుపత్రుల్లో డాక్టర్లు బ్రాండెడ్ మందులే ప్రిఫర్ చేస్తున్నారు. అంతే కాకుండా ఆర్ఎంపీలు సైతం బ్రాండెడ్ మందులే వాడుతున్నారు. రోగులు ఎవరైన జనరిక్ మందుల గురించి ప్రస్తావిస్తే అవి సరిగా పని చేయవని సమాధానం ఇస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన పేద, మధ్యతరగతి రోగులు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. దీనిపై గతంలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) చాలా సార్లు పలు గైడ్లైన్స్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీ చేసింది. బ్రాండెడ్ మందుల స్థానంలో జనరిక్ మందులు ప్రిస్క్రైబ్ చేయాలని, మందుల చిట్టీలో విడిగా అక్షరాలు రాయాలని ఎంసీఐ సూచించింది. అయినా ప్రైవేటు వైద్యుల తీరు మారడలేదు. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారి దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది,



జనరిక్ మందుల షాపు

అనుమతులు తీసుకుని షాపు పెట్టుకుంటే గిరాకీ లేదు



చేగొండ కిరణ్, జనరిక్ మందుల షాపు నిర్వాహకుడు

డబ్బులు ఖర్చు పెట్టి అనుమతులు తీసుకొని, వేలాది రూపాయలు అద్దెకు తీసుకొని షాపు పెట్టుకుంటే గిరాకీ ఉండడం లేదు. డాక్టర్లు వారి వద్ద ఉన్న ఆస్పత్రి మెడకల్ కౌంటర్లకే మందులు రాస్తున్నారు. కేవలం అవగాహన ఉన్న వారు మాత్రమే మా దగ్గర మందులు కొంటున్నారు. ఇంత వరకు ఏ ఒక్క డాక్టర్ చీటి రాయలేదు.

జనరిక్ మందులు తక్కువకు ఎందుకు

ఏదైనా ఒక కంపనీ కొత్త మందును తయారు చేశాక క్లినికల్ ట్రయల్స్ పూర్తి చేసి మార్కెట్లోకి తీసుకొస్తే ఆ మెడిసిన్‌పై ఆ కంపనీ బ్రాండ్ వేసుకొని మార్కెట్లో విడుదల చేస్తుంది. ఆ మందుపై ఆ కంపనీకి 10 సంవత్సరాల పేటెంట్ ఉంటుంది. పేటెంట్ గడువు ముగిసిన తర్వాత ఆ మందును ఎవరైనా తయారు చేయవచ్చు. దీన్నె జనరిక్ మందులుగా మార్కెట్లో విడుదల చేస్తారు. బ్రాండ్ ఇమేజ్ అవసరం లేదు. కాబట్టి తయారీ వ్యయం తక్కువ, డ్రగ్స్ కాంబినేషన్ జనరిక్ మందులకు, బ్రాండెడ్ మందులకు సమానంగా ఉంటుంది. తయారీలో ఏ మాత్రం తేడా ఉండదు. ధరలో మాత్రం భారీ తేడా ఉంటుంది. బ్రాండెడ్ మందులకు జనరిక్ మందులకు ధరలో 70 శాతం పైగా తేడా ఉంటుంది. ఫార్ములా అంతా ఒకటే, ధర మాత్రం జనరిక్ మందుల కంటే బ్రాండెడ్ అధిక రేట్లు ఎక్కువగా ఉంటుంది. దీంతో పేద రోగులు ఆర్థికంగా దోపిడికి గురవుతున్నారు. ఉదాహరణకు క్రోసిన్ అంటే బ్రాండెడ్ పేరు, అదే జనరిక్ అంటే పారసిటమల్ అని రాయాలి. అలాగే నోవామాక్స్ అనేది బ్రాండెడ్ పేరు కాగా, అమాక్సిలిన్ అనేది జనరిక్ మందుపేరు, అలాగే అజిరైట్ అనేది బ్రాండెడ్ పేరు దాని జనరిక్ పేరు అజిత్రోమైసిన్ అని రాస్తారు. కానీ పర్సంటేజీలకు కక్కుర్తి పడుతున్న డాక్టర్లు బ్రాండెడ్ మందులకు ప్రత్యేకత ఇస్తున్నారు.

మద్యం మత్తులో యువకుడి హంగామా

● ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం



ఒంటిపై గాయాలతో సాయికుమార్

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు మండల కేంద్రంలో హంగామా సృష్టించాడు. మండేపల్లి మూలమలుపు వద్ద తంగళ్లపల్లికి చెందిన సాయికుమార్ కుటుంబ కలహాలతో మద్యం మత్తులో కత్తితో ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని ఆసుపత్రికి తరలించారు.

పార్వతీపురం పోలీస్ క్వార్టర్‌లో నాగుపాము కలకలం



నాగుపాము పడుతున్న జగదీష్

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వెనుకవైపు ఉన్న పార్వతీపురం పోలీస్‌క్వార్టర్‌లో గురువారం రాత్రి నాగుపాము దూరి కలకలం సృష్టించింది. ఆలయ పార్వతీపురం 13ఏలో ఆలయభద్రతా సిబ్బంది నివాసం ఉంటారు. ఈ పోలీస్‌క్వార్టర్‌లో అయిదు అడుగులనాగుపాము ప్రత్యక్షమైంది. ఇదిచూసిన భద్రతాసిబ్బంది స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించారు. అతను వచ్చి పామునుపట్టి దూరంలో వదిలిపెట్టాడు.

కొండచిలువ హతం



గర్రెపల్లిలో కొండ చిలువ

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లిచెరువు సమీపంలోని వైకుంఠ దామం వద్ద రహదారిపై రైతులకు కొండ చిలువకనిపించింది. ఈదారివెంట వెళ్లా లంటే భయంగా ఉందని రైతులు పేర్కొన్నారు. గర్రెపల్లి మీదుగా గొల్లపెల్లి, సాంబయ్యపల్లి, నారాయణరావుపల్లి గ్రామాలకుచెందిన వారు ఈదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు కర్రలతో కొట్టడంతో చనిపోయింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామగుండానికి చెందిన ఆకుల శివ కుమార్ అనేవ్యక్తి అక్టోబరు 26న తన సెల్‌ఫోన్‌ను ఆరెపల్లి వద్ద పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ సెల్‌ఫోన్ హైదరాబాద్‌లో ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడిని గురువారం రూరల్ స్టేషన్‌కు పిలిచి సీఐ ఏ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను అందజేశారు.

పరిశ్రమల అభివృద్ధికి ఉద్యమ్

● బ్యాంకు రుణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఉద్యమ్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపార రంగంలో స్థిరపడేందుకు బ్యాంకులు రుణాలు అందజేస్తుంటాయి. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉంటేనే బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయి. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సంస్థల అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది. తక్కువ వడ్డీ ప్రయోజనాలు కలిగిన ఉన్న వివిధ పథకాలు, గ్యారంటీ లేని రుణాల కోసం ఉద్యమ్ పోర్టల్‌లో తప్పనిసరంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ప్రయోజనాలు...

ప్రభుత్వ పథకాల ద్వారా నిరుద్యోగులు, వ్యాపారులు పొందే రుణాల్లో వడ్డీ రాయితీ, గ్యారంటీ లేకుండా రుణం పొందే అవకాశం, తక్కువ వడ్డీకే రుణాల లాంటి ప్రయోజనాలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో కలుగుతాయి. ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ ద్వారా అందించే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కాగిత రహితంగా పూర్తిగా ఆన్‌లైన్‌లో జరిగే ప్రక్రియ. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం యూఆర్ఎన్ నంబర్‌తో కూడిన ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. సంస్థకు ఒక శాశ్వత సంఖ్యతో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ఆధార్, పాన్ లింకు కలిగి ఉండి, పట్టణాల్లో అయితే స్ట్రీట్ వెండర్లకు, ముద్ర రుణాల దర ఖాస్తుదారులకు, పరిశ్రమలు, సేవా రంగంలో వ్యాపారం కోసం పీఎంఈజీపీ లాంటి పథకాలలో బ్యాంకు రుణాలు తీసుకునేవారికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని బ్యాంకు అధికారులు చెప్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఇలా...

www.udyamregistration.gov.inఅనే వెబ్‌సైట్‌లో ఫర్ న్యూ ఎంటర్‌ప్రెన్యూర్స్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. దానిలో ఆధార్ జూంబర్, పేరు నమోదు చేసి జనరేట్ చేయగానే ఆధార్ కార్డుకు లింకు ఉన్న మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేయగానే పాన్‌కార్డు నంబర్, వివరాలు అడుగుతుంది. పాన్‌కార్డు వివరాలు ఎంటర్ చేయగానే మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సామాజిక వర్గం, వ్యాపార సంస్థ పేరు, చిరునామా, సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకు వివరాలు, పెట్టుబడి వివరాలు నమోదు చేయాలి. అన్ని వివరాలు సరిచూసుకున్న తర్వాత దరఖాస్తును సబ్‌మిట్ చేయాలి. దరఖాస్తును సమర్పించగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్ (యూఆర్ఎన్) చూపిస్తుంది. నమోదు చేసిన మెయిల్ ఐడీ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వస్తుంది. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టి ఫికెట్‌ను కేంద్ర ప్రభుత్వ ఎం ఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది.



లొంగుబాటలో మావోయిస్టు నేత మల్లా రాజిరెడ్డి?

● మంతనాలు జరుపుతున్న బంధుమిత్రులు
● రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం..

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తెన్న లొంగుబాటుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు సమాచారం. లొంగుబాటు కోసం మార్గం సుగమమయ్యేందుకు ప్రభుత్వ పెద్దలతో రాజిరెడ్డి బంధు, మిత్రులు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ కగార్‌తో దండకారణ్యంలో చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్‌లు, పదులసంఖ్యలో అగ్రనేతలు మృత్యువాత, లొంగిపోయారు. ఈక్రమంలో రాజిరెడ్డి లొంగు బాటు కోసం వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో రెండురోజుల్లో రాజిరెడ్డి లొంగుబాటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మంథని మండలంలోని శాస్త్రులపల్లి గ్రామానికి చెందిన మల్లా రాజిరెడ్డి విప్లవ రాజకీయాలకు ఆకర్శితుడై దాదాపు 45ఏళ్లుగా పని చేస్తూ కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా 2007లో కేరళలోని ఎర్నాకుళంలో పోలీసులు అరెస్టు చేయగా మంథని, మెట్‌పల్లి కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించారు. కేసుల విచారణ అనంతరం బెయిల్ పై విడుదలైన రాజిరెడ్డి తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు.



మల్లా రాజిరెడ్డి(ఫైల్)

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం..

● బట్టల షాపునకు నిప్పు పెట్టుకున్న యజమాని ● అగ్నిప్రమాదమంటూ పోలీసులకు ఫిర్యాదు
● కుట్రను ఛేదించి ముగ్గురిని అరెస్టు చేసిన త్రీటౌన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో ఈనెల 17న ఉదయం జరిగిన అగ్నిప్రమాదం కేసును త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదని, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం యజమాని ఉద్దేశపూర్వకంగా చేసిన పని అని పోలీసులు గుర్తించారు. కరీంనగర్ త్రీటౌన్‌సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్ యజమాని సంగం రాజేశ్ వ్యాపారంలో నష్టాలు రావడం, అప్పుల బాధతో ఇన్సూరెన్స్ డబ్బులు క్లెయిమ్‌చేసి బయటపడాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనవద్ద పనిచేసే రాకేశ్, మధుతో కలిసి కుట్రపన్నాడు. ఘటనకు ముందు షాపులోని విలువైన బట్టలను రహస్యంగా తరలించి, అనంతరం పెట్రోల్ పోసి షాపునకు నిప్పంటించారు. అనంతరం ఏమీ తెలియనట్లు రాజేశ్ డయల్ 100కు ఫోన్‌చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే షాపులో ఒక మూలన మాత్రమే బట్టలు కాలిపోయి ఉండటం, సీసీ కెమెరాల డీవీఆర్ కాలిపోవటంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ జాన్‌రెడ్డికి అనుమానం కలిగింది. ఆ షాపులో సీసీ కెమెరాలను పరిశీలించేందుకు అవకాశం లేకుండా డీవీఆర్ కాలిపోయింది. దీంతో షాపు సమీపంలో, చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు షాపు యజమాని, వర్కర్, గుమాస్తాల కదలికలు అనుమానాస్పదంగా కలిపించాయి. దీంతో మరింత లోతుగా విచారణ జరిపి, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. నేరానికి వాడిన పెట్రోల్‌బాటిల్, సెల్‌ఫోన్, షాపునుంచి తరలించిన బట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు సంగం రాజేశ్ (షాపు యజమాని), రాకేశ్ (వర్కర్), మధు (గుమస్తా)ను గురువారం అరెస్టు చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ఏడాది జైలు శిక్ష

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన ఒక మహిళపై అత్యాచారయత్నం కేసులో నేరం రుజువు కావడంతో ఆమె మామ అయిత చంద్రయ్యకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం గోదావరిఖని కోర్టు తీర్పునిచ్చింది. 2024 నవంబరు 27న తనపై అత్యాచారం చేశారంటూ బాధితురాలు గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ భూమేష్ కేసు నమోదు చేశారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, ఏపీపీ పద్మజ, అడిషనల్ జిల్లా, సెషన్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా న్యాయమూర్తి శ్రీనివాసరావు దోషికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన టిప్పర్

● కూలీలకు గాయాలు

బోయినపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో కూలీలకు గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నీలోజిపల్లి గ్రామానికి చెందిన కోనుకటి రవీందర్‌కు చెందిన ట్రాక్టర్‌ను కొత్తపేట గ్రామానికి చెందిన కోనుకటి తిరుపతి అద్దెకు తీసుకున్నాడు. గురువారం కూలీలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా డ్రైవర్ ఎర్రనాగరాజు కొత్తపేట ఎస్సీ కాలనీలో నిలిపాడు. వేములవాడకు చెందిన టిప్పర్ లారీని రెడ్డవేని జశ్వంత్ అనేవ్యక్తి నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి ట్రాక్టర్ ట్రైలర్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కూలీలు కుర్మ రాజవ్వ, ఎల్లండుల కమలవ్వ, ఎల్లండుల లచ్చవ్వ, కోనుకటి రమ్య, ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజు రోడ్డుపై పడిపోగా వారికిగాయాలయ్యాయి. వారిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ రమాకాంత్ తెలిపారు.

మోసం చేసిన కేసులో వ్యాపారి అరెస్టు

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి మోసానికి పాల్పడిన గద్దలపల్లి లోని శ్రీలక్ష్మిప్రసన్న ఇండస్ట్రీస్ పార్ట్నర్ భైర్నేని వరప్రసాద్‌రావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. 2023-24 సంవత్సరానికి చేసుకున్న ఒప్పందం ప్రకారం ఖరీఫ్‌సీజన్‌లో కొనుగోలు చేసిన వడ్లను రైస్‌మిల్లు ఇవ్వగా వారు 38,489క్వింటాళ్ల సివిల్‌సప్లై కార్పొరేషన్‌కు 25,680క్వింటాళ్ళ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా మిల్లు వ్యాపారులు వరప్రసాద్, తాటిపెల్లి శ్రీనివాస్‌లు అగ్రిమెంట్‌ను దుర్వినియోగం చేసి బియ్యాన్ని కార్పొరేషన్‌కు ఇవ్వకుండా రూ.12.37కోట్లు మోసం చేసినట్లు మేనేజర్ శ్రీకాంత్‌ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో తాటిపెల్లి శ్రీనివాస్‌ను అరెస్టు చేశామన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి



అభినవ్(ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి గోవింద్ అభినవ్(25) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన అభినవ్ బద్దిపోచమ్మ దేవాలయంలో రోజువారికూలీగా పనిచేస్తుంటాడు. పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి అభినవ్ మురికికాలువలో పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈవిషయం గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో మండేపల్లి వాసి మృతి



తిరుపతి(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన జడల తిరుపతి(58) మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం... సిద్దిపేటలో బంధువులు మృతిచెందగా పరామర్శకు జడల తిరుపతి-రజిత దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రజిత తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి



లచ్చవ్వ(ఫైల్)

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన పున్న లచ్చవ్వ(59)అనే మహిళ ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్ర గాయాలతో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పున్న లచ్చవ్వ తన తల్లితో కలిసి పోతారంలో తమ్ముడి ఇంట్లో ఉంటోంది. మంగళవారం సాయంత్రం ఇంటిముందు గడ్డిని కాలుస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. దీంతో చికిత్సకోసం జగిత్యాలఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం రాత్రి మృతిచెందినట్లు మృతురాలి సోదరుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరండాలోనే శిశువు మృతదేహం

● మానవత్వం మరిచిన ఆసుపత్రి సిబ్బంది

కళ్యాణ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భంలో మృతి చెందిన శిశువును వరండాలో రాత్రి నుంచి ఉదయం వరకు ఉంచడంతో కుటుంబ సభ్యులకు ఏం చేయాలో తెలియక ఇబ్బందులకు గురయ్యారు. గోదావరిఖని ప్రభుత్వఆసుపత్రికి ప్రసవంకోసం మంథనికిచెందిన ఓగర్భిణి బుధవారం ఆసుపత్రిలో చేరింది. కడుపులోనే బిడ్డ అడ్డం తిరిగి మృతిచెందడంతో ఆమె భర్తకు శిశువును అప్పగించి ఆసుపత్రి సిబ్బంది చేతులు దులుపుకున్నారు. శిశువును ఏం చేయాలో అర్థంకాక లేబర్‌రూమ్ వద్ద పెయిడ్‌రూమ్‌ల వద్ద ఆ శిశువును ఉదయం 11గంటలవరకు అక్కడేఉంచారు. వాస్తవానికి శిశువు మరణించిన తరువాత కుటుంబ సభ్యుల అభిప్రాయం మేరకు ఆసుపత్రి సిబ్బంది ఖననం చేస్తారు. కానీ సిబ్బంది పట్టించుకోకుండా ఓ కాటన్ డబ్బాలో పెట్టి ఇవ్వడంతో ఏమి చేయలేక ఆ శిశువును మూలన పెట్టి ఉదయం వరకు జాగరణచేశారు. మృతిచెందిన శిశువును ప్యాకింగ్‌చేసి ఊరు చివరలో వైద్యసిబ్బంది ఖననం చేయాల్సి ఉంటుంది. శిశువును కాటన్ డబ్బాలో పెట్టి ఏమితెలియక గర్భిణి భర్త ఆసుపత్రి చుట్టూ తిరిగాడు. ఉదయం 11గంటలకు అక్కడున్నకొంతమంది శిశువు మృతదేహాన్ని చూసి వైద్యసిబ్బందిని ప్రశ్నించడంతో హడావిడిగా ఖననంచేశారు. ఆసుపత్రి సిబ్బంది ఇలా మానవత్వం మరవడంపై అక్కడున్నవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పునుకప్పిపుచ్చుకోవడానికి సిబ్బందినానాతంటాలు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో గల మారుతీ టౌన్‌షిప్ వద్ద ఎదురెదురుగా కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికిగాయాలు అయ్యాయి. కోరుట్లకు చెందిన మనికంఠ, మకరంథ్ ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా టౌన్‌షిప్ ప్రాంతంలో ఎదురుగా కరీంనగర్ వైపు వస్తున్నకారు ఢీకొంది. దీంతో మనికంఠకాలుకు, మకరంథ్‌కు తీవ్ర గాయాలుకాగా చికిత్సకోసం జగిత్యాలకు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీకి చెందిన బోగ మధుసూధన్ అనేవ్యక్తి నెల రోజులుగా కనిపించడం లేదని అతడి భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. జగిత్యాలలోని ఓరైస్‌మిల్లులో పనిచేసే మధుసూధన్ గతనెల 8న పనికి వెళ్తున్నాననిచెప్పి ఇంటినుంచివెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ



లాకర్‌ను, హుండీని ధ్వంసం చేసిన దొంగలు

కోరుట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ముదిరాజ్ సంఘ నాయకులు తెలిపారు. ఆలయంలోని ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఆలయంలో ఉన్న వెండి, బంగారు ఆభరణాలతో పాటు హుండీ, లాకర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. హుండీలో సుమారుగా రూ.5వేల వరకు నగదు ఉంటుందని వారు తెలిపారు. సంఘ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైపాస్ ఫ్లైఓవర్ గోడ ధ్వంసం



ధ్వంసమైన గోడ

కరీంనగర్ క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లో గ్రానైట్‌లారీ అదుపుతప్పి ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టడంతో లారీలో ఉన్న భారీ గ్రానైట్‌రాయి ఫ్లైఓవర్ గోడకు తాకడంతో గోడ ధ్వంసమైంది. గురువారం రాత్రి 7గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తానాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ అదుప్పుతప్పటంతో పెద్ద బండరాయి ఫ్లైఓవర్ గోడను ఢీకొంది. దీంతో గోడకు పెద్ద రంధ్రం ఏర్పడి ధ్వంసమైంది. ఫ్లైఓవర్ గోడకు పెద్దరంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఇల్లంతకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ కల్లూరి బాలరాజుపై దాడి చేసిన నిందితుడు పిట్ల శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై సిరిసిల్ల అశోక్‌లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు బయలుదేరింది. వల్లంపట్ల గ్రామసమీపంలో ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఇవ్వలేదని సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గంగాపూర్‌కు చెందిన శ్రీకాంత్ కారు కొంత దూరం వెళ్లిన తర్వాత తిప్పుకొని వచ్చి ఆర్టీసీ బస్సుకు ఎదురుగా నిలిపాడు. డ్రైవర్ బాలరాజును దుర్భాషలాడి, బస్సు క్యాబిన్‌లోకి వచ్చి డ్రైవర్‌పై దాడిచేశాడు. బస్సు అద్దాన్ని పగలగొట్టడానికి రాయితో విసరగా అద్దం పగిలి రోడ్డుపక్కన కూర్చున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన సంది వజ్రవ్వకు తగిలింది. ఘటనను ప్రశ్నించిన ఒబులాపూర్ గ్రామానికి చెందిన బత్తుల రాజవ్వ అనే ప్రయాణీకురాలితో శ్రీకాంత్ వాగ్వాదానికి దిగాడు. బస్సులో జరిగిన ఘటనను బస్సు మహిళా కండక్టర్ కాళేశ్వరి తన మొబైల్‌ఫోన్‌లో వీడియో తీసింది. వీడియో సోషల్ మీడియాల్ వైరల్ కావడంతో నిందితుడు పరారయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు అయ్యింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో మూడు టీంలు ఏర్పాటు అయ్యి, సాంకేతిక ఆధారంగా గురువారం రహీంఖాన్‌పేట గ్రామసమీపంలో నిందితున్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ వద్ద పాతయంత్రాల తరలింపు వివాదం

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణ కాంట్రాక్టు పనులు నిర్వహించిన సింప్లెక్స్ సంస్థ తన యంత్ర సామాగ్రిని తరలించే విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ బయట ఉన్న ఈ సామాగ్రిని తరలిస్తుండగా ఆర్ఎఫ్‌సీఎల్ సామాగ్రి ఉందంటూ కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో తరలింపును నిలిపివేశారు. రెండు నెలల క్రితం ట్రాన్స్‌పోర్టర్ విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు మాత్రం ఆసామాగ్రికి, మాకుసంబంధం లేదని పేర్కొంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్ గ్రామానికి ఇసుకను ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.

ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెన్షన్

● జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఉత్తర్వులు

హుజూరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డీఈవో ఉత్వర్వులు జారీచేశారు. హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం అయిలయ్య విధులకు సక్రమంగా నిర్వహించడం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకో వడం లేదనే ఫిర్యాదులు అందాయి. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, ఏ సమ్మయ్యలు మద్యం తాగి పాఠశాలకు హాజరైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన డీఈవో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నివేదిక అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డివిజన్‌లోని సైదాపూర్, శంకరపట్నం, జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి.

జాతీయ స్కౌట్స్, గైడ్స్ క్యాంప్‌నకు ఖని విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈనెల 25నుంచి 29వరకు జరగనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరిలో పాల్గొనడానికి ఖని విద్యార్థులు గురువారం తరలివెళ్ళారు. 8మంది స్కౌట్స్, 8మంది గైడ్స్, గైడ్ కెప్టెన్ విజయ, స్కౌట్ మాస్టర్ రవీందర్‌ల ఆధ్వర్యంలో శ్రీరామ విద్యానికేతన్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ సుల్తానాబాద్ విద్యార్థుల బృందం వెళ్లారు. రామగుండం ఎంఈవో జింక మల్లేశం జెండా ఊపి విద్యార్థుల వాహనాన్ని ప్రారంభించారు.



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

బీజేపీలో విభేదాలు లేవు

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీలో విభేదాలు లేవని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీలోనైనా అంతర్గత విభేదాలు సహజమని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అందరం కలిసి పెద్ద మొత్తంలో స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. హుజూరాబాద్‌లో జరిగే కార్యక్రమాలపై తనకు సమాచారం ఉందని, తన వ్యక్తిగత కారణాలతోనే రాలేక పోయానన్నారు. బీజేపీ నాయకుల మధ్య గ్యాప్ ఉందన్నదని సోషల్ మీడియా సృష్టి మాత్రమే అన్నారు. మావోయిస్టుల లొంగుబాటు, ఎన్‌కౌంటర్లపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్టాండే తమ స్టాండ్ అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీల్లో పాలకులు లేక అభివృద్ధి కుంటుపడి పోయిందన్నారు. 25 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి పెద్ద ఎత్తున సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాలను గెలిపించుకుంటామన్నారు.

● గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

జమ్మికుంట రూరల్: గ్రామపంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేక రెండేళ్లు అవుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. 25ఏళ్లుగా ఇక్కడి ప్రజలతో అనుబంధం ఉందన్నారు. త్వరలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు సన్న వడ్లకు బోనస్ ఇచ్చి రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఫామ్‌లతో సంబంధం లేకుండా ప్రజలమధ్యలో ఉండి ప్రజలు మెచ్చిన నచ్చిన వాళ్లను గెలిపించుకుంటామన్నారు. ఇకనుంచి నియోజకవర్గంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగెశోభ, ఎరబెల్లి సంపత్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రావు పాల్గొన్నారు.

ఉమ్మడిజిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలు

● హాజరైన 130 మంది క్రీడాకారులు



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 రెజ్లింగ్‌పోటీలకు విశేషస్పందన లభించింది. జిల్లాకేంద్రంలోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో నిర్వహించిన ఈపోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 100మంది బాలురు, 30మంది బాలికలు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, ఉమ్మడిజిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ కరీంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రెజ్లింగ్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చాటారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని జిల్లా క్రీడాకారులు ఎదగాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాజట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాష్, పోటీల కన్వీనర్ బి సత్యనారాయణ, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు సఫియా, ఎన్ శ్యామలదేవి, రెజ్లింగ్ కోచ్‌లు వంశీకృష్ణ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కష్టాలు తీరేదెప్పుడో..?



చిత్రవేణిగూడె వెళ్లే రోడ్డు

● చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాలకు నడవని బస్సులు
● ఎటు వెళ్లాలన్నా మైళ్ల దూరం నడవాల్సిందే
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, వృద్ధులు

బీర్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలాలు మారినా, ప్రభుత్వాలు మారినా గిరిజనులకు రవాణా సౌకర్యం కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీర్‌పూర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాల ప్రజలు ఎటు ప్రయాణం చేయా లన్నా మైళ్ల దూరం కాలినడకన వచ్చి ఆర్టీసీ బస్సు ఎక్కాల్సిందే. ఒకప్పుడు చిత్రవేణిగూడెం గ్రామం తాళ్లధర్మారానికి అనుబంధ గ్రామంగా, చిన్నకొల్వాయి గ్రామం కొల్వాయికి అనుబంధంగా ఉండేవి. నూతన పంచా యతీలు ఏర్పడిన తర్వాత చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి గ్రామాలు జీపీలుగా ఏర్పడినా ఆర్టీసీ బస్సు సౌకర్యానికి మాత్రం నోచుకోవడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు.

నాలుగు కి.మీ.లు నడిస్తేనే బస్సు

చిత్రవేణిగూడెం గ్రామ ప్రజలు ఏదైనా పని నిమిత్తం బీర్‌పూర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 10 కి.మీ.లు ప్రయాణించాలి. బస్సు సౌకర్యం లేక చిత్రవేణిగూడెం ప్రజలు బీఆర్‌పూర్ వెళ్లాలంటే 4 కి.మీ. కాలినడకన తాళ్లధర్మారం వరకు రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి బీఆర్‌పూర్‌కు బస్సులో వెళ్తారు. చిత్రవేణిగూడెంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులను చూసేందుకు తల్లిదండ్రులు, బంధువులు ఆయా ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తుంటారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తాళ్ళధర్మారం గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద దిగి చిత్రవేణిగూడెంకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులు రావడం లేదని గిరి జనులు పేర్కొంటున్నారు.

మండలంలోని కొల్వాయి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నకొల్వాయికి కూడా బస్సు సౌకర్యం లేదు. దీంతో గిరిజనులు చిన్న కొల్వాయికి వెళ్లాలంటే కొల్వాయి నుంచి మైళ్ల దూరం నడవాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనుబంధ గ్రామాల ప్రజలకు సైతం బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి
: కోట్నాక గంగవ్వ, చిన్నకొల్వాయి



ప్రతి పనికి కొల్వాయి వెళ్లాలి. ఏదైనా ఊరికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. చిన్నపిల్లలు, వృద్ధులు నడవడం చాలా ఇబ్బంది అవుతుంది. సార్లు మా బాధలు పట్టించుకోవాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చిన్నకొల్వాయికి బస్సు సౌకర్యం కల్పించాలి.



చిన్న కొల్వాయికి వెళ్లే రోడ్డు

ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం
చిక్రం మారుతి, చిత్రవేణిగూడెం



గ్రామస్థులు ఏదైనా గ్రామం వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. గ్రామంలోని 35మంది బాలికలు చదువుకోవడానికి నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన తాళ్ళధర్మారం గ్రామానికి వచ్చి చదువుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామస్థుల సమస్య తీర్చాలి.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జడ్పీ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో ఈనెల 22నుంచి జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడిజిల్లా జట్టులోకి విద్యార్థులు టి తరుణ్, యు వినీత్, సీహెచ్ కృష్ణ, పి అక్షయ, బి శ్రీదేవి ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎండి జలీల్ తెలిపారు. ఈనెల12న జగిత్యాలలో జరిగిన ఉమ్మడిజిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

23న ఉమ్మడి జిల్లా సీనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి కరీంనగర్ జిల్లాసీనియర్స్ మహిళలు, పురుషుల బాస్కెట్‌బాల్ జట్లఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలనుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి అనంతరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే ఉమ్మడిజిల్లా జట్లకుఎంపిక చేయనున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల క్రీడాకారులు ఈపోటీలలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎస్‌యూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకామ్ (సీఏ), ఎంకామ్ (బ్యాంకింగ్ ఇన్సూరెన్స్), ఎంకామ్, సీఏ (ఎఫ్ఏ) కోర్సులకు మూడవ సెమిస్టర్ పరీక్షఫీజు షెడ్యూల్‌ను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి డి.సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షలు డిసెంబర్‌లో జరుగుతాయని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని, లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి

● ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల్లో ఫేస్‌రికగ్నిషన్ తప్పనిసరి అని ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ,పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, సెక్రెటరీలు, కరస్పాండెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు అన్ని కళాశాలల్లో విద్యార్థులకు ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి చేయాలని అన్నారు. విశ్వవిద్యాలయ ఆవరణలోని అన్నికళాశాలల్లో విద్యార్థులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి ఫేస్‌రికగ్నిషన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్యరవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫేస్‌రికగ్నిషన్ వలన క్రమశిక్షణ అలవడి కళాశాలకు క్రమం తప్పకుండా వస్తారని ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్, ఓఎస్డీ టు వీసీ డాక్టర్ బి హరికాంత్, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సరసిజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

అజ్ఞానపు చీకట్లను పారదోలేదే దీపం..

● హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి ● గంగమ్మకు దీప హారతి



హారతి ఇస్తున్న విద్యారణ్యభారతీ స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానపు చీకట్లను దూరం చేసి జ్ఞాన జ్యోతులను నింపేదే దీపం అని హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు వద్ద హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి హాజరై గంగమ్మకు దీపార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. నిత్యం ప్రతి ఇంట్లో ఉదయం, సాయంత్రం సమయంలో దీపారాధన చేస్తే శుభప్రదమన్నారు. ఏ కార్యం చేపట్టిన జ్యోతిని వెలిగించే గొప్పదనం హిందూ సంస్కృతిదని అన్నారు. దీపం వెలిగిస్తే మనిషిలోని అహం అంతమై కాంతుల్లో ఆశలు చిగురిస్తాయని అన్నారు. నిత్యం దీపాన్ని ఆరాధిస్తే జ్ఞానం, సంపద సమకూరుతుందన్నారు. మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి నీటిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో వేదపండితులు రాచర్ల రఘురామశర్మ, రాచర్ల విశ్వనాథశర్మ, ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

వైభవంగా దీపోత్సవం

● కార్తీకమాస ముగింపు సందర్భంగా ధర్మపురి,వేములవాడల్లో భక్తుల ప్రత్యేక పూజలు



ధర్మపురిలో దీపోత్సవం కార్యక్రమం



కార్తీక మాసం ముగింపు హారతి ఇస్తున్న అర్చకులు



వేములవాడలో భీమన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోదావరి నదీతీరాన అనంత దీపోత్సవం కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నదీతీరాన శివలింగానికి రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. నదీతీరాన గల స్నానఘట్టాల మెట్లపైన ప్రత్యేకంగా దీపాలు ఏర్పాటు చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నదిలో దీపాలు వదిలి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్ర మంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మపురి సీఐరాంనర్సింహారెడ్డి, శారదా మహిళామండలి, వాసవి మహిళామండలిసభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపుసభ్యులు, పెద్దపల్లి శ్రీవల్లిసేవాగ్రూపు సభ్యులు, స్థానికమహిళలు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

భీమన్న సన్నిధిలో కార్తీక వేడుకలు

వేములవాడ టౌన్: వేములవాడ భీమేశ్వరాలయంలో కార్తీక వేడుకలు గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజున ఆలయఈవో రమాదేవి కార్తీకదీపాలను వెలిగించి ప్రారంభించగా, సుహాసినులు, భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. సుహాసినులకు వాయినం ఇచ్చి పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులతోపాటు స్వామివారి ఫోటోను ఈవో అంద జేశారు. దీంతో కార్తీక మాసోత్సవాలు ముగిశాయి.

ఉత్తమ సహకార సంఘంగా సుల్తానాబాద్ సొసైటీ



అవార్డు అందుకుంటున్న సుల్తానాబాద్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల వారోత్సవాలను పురస్కరించుకొని సుల్తానాబాద్ సహకారసంఘాన్ని ఉత్తమ సంఘంగా ఎంపికచేశారు. గురువారం హైదరాబాద్ జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో సొసైటీచైర్మన్ శ్రీగిరిశ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ చైర్మన్ అవార్డులను ప్రదానం చేశారు. సహకారసంఘాల సమాఖ్య మాజీజాతీయ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు చేతులమీదుగా శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యుల సహకారం, సంఘంపై విశ్వాసం వల్లే విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కేడీసీసీబ్యాంక్ అధ్యక్షుడు రవీందర్‌రావు, అధికారులు, పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డికి..

ఎల్లారెడ్డిపేట: సహకారసంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు లాభాల బాటలోకి తీసుకురావడానికి విశేషకృషి చేసిన ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సహకార ఉత్తమ ప్రదర్శన అవార్డును అందుకున్నారు. తెలంగాణ సహకార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సహకార సంఘ భవనంలో నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా గురువారం అవార్డుల ప్రధానోత్సవకార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమసేవలు అందించినందుకు కృష్ణారెడ్డి నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకోవడంపై ప్యాక్స్ డైరెక్టర్లు, రైతులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం స్వల్పంగా నీరు వచ్చి చేరుతోంది. ఎగువప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 9,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీకాలువ ద్వారా 650క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8వేల క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

షార్ట్‌సర్క్యూట్‌తో హార్వెస్టర్‌లో మంటలు

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

జగిత్యాలరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని పొలాసగ్రామంలో గురువారం వరికోస్తుండగా హార్వెస్టర్‌కు షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్‌వెంటనే కిందకి దూకి ఫైర్‌సిబ్బందికి ఫోన్‌చేశారు. తక్షణమే స్పందించిన ఫైర్‌సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో పెనుప్రమాదంతప్పింది. ఈప్రమాదంలో హార్వెస్టర్ యజమానికి సుమారు రూ.5లక్షలు నష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో కృష్ణకాంత్, ఏఎల్ఎఫ్ఎఫ్ వెంకటేశ్వర్లు, ఆపరేటర్లు మల్లేశం, ప్రణయ్, ఫైర్‌ఫైటర్స్ బాస్కర్, రాజేందర్, గంగేష్ పాల్గొన్నారు.



హార్వెస్టర్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

అందెశ్రీ సంస్మరణ సభ వాయిదా

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత అందెశ్రీ సంస్మరణ సభను ఈనెల 22న నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకుడు, ప్రముఖ న్యాయవాది కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి గురువారం తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిన ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ.ఖాసీం రాకపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈవిషయాన్ని అందరు గమనించాలని, త్వరలోనే తిరిగి సభను నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో బాధ్యతారహితంగా ఎవరూ పోస్టులు చేసిన వారి పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంథని ఎస్ఐ డేగ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరువర్గాలను రెచ్చగొట్టే విధంగా, ఒక వ్యక్తిని, ఒక వర్గాన్ని కించ పరిచేవిధంగా పోస్టులు పెడుతూ కామెంట్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి పోస్టులు, ఫోటోలు, వీడియోలు ఘర్షణలకు దారి తీసి శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి



అప్పన్నపేటలో ధాన్యం పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

పెద్దపల్లి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసు కొచ్చి రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని, కొనుగోలు వెంటనే చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. గురువారం అప్పన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ నాయకులు సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సదానందం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టి, కొనుగోలు కేంద్రాల వద్ద తాగు నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సబ్సిడీ పై టార్పలిన్ లు అందించాలని డిమాండ్ చేశారు. వాతావరణ మార్పులతో రైతులకు ఇబ్బందులు అయ్యే అవకాశాలు ఉన్నాయని, త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టాలన్నారు. వారి వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రలో పాల్గొన్న కార్మికుడికి అభినందన



తిరుపతిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, నవంబు 20(ఆంధ్రజ్యోతి):సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఏ రైడ్ ఫర్ యూనిటీ పేర కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహించిన సైక్లింగ్ ఎక్స్‌పెడేషన్‌లో పాల్గొన్న సింగరేణి కార్మికుడు వెంకట తిరుపతిరెడ్డిని గురువారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అభి నందించారు. క్యాంపు కార్యాలయంలో ఆయనకు శాలు వాకప్పి సత్కరించారు. సైక్లింగ్ వంటి క్రీడల్లో జాతీయ స్థాయి ఎక్స్‌పెడేషన్‌కు ఎంపిక కావడమే కాకుండా 16రోజుల పాటు 4200కిలోమీటర్లకు పైగా సైకిల్ యాత్ర చేయడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ నాయ కులు మారెల్లి రాజిరెడ్డి, చెరుకు బుచ్చిరెడ్డి ఉన్నారు.

ఏసీపీ అభినందన

జాతీయ స్థాయిలో సైకిల్ యాత్ర చేసిన తిరుపతిరెడ్డిని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అభినందించారు. సైకిల్ రైడర్ అయిన ఏసీపీ ఈ సైక్లింగ్‌లో యువతను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలన్నారు.

వాకర్స్ అండ్ యోగా అసోసియేషన్ కార్యవర్గం

యైటింక్లయిన్‌కాలనఈ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం స్టేడియంలో వాకర్స్ అండ్ యోగా అసోసియేషన్ కమిటీని గురువారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జరిగిన వాకర్స్ సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా రేశవేని కేశవులు, ప్రధాన కార్యదర్శిగా గంధం సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా పొన్నం సంపత్, జాయింట్ సెక్రెటరీగా రాపాల సారయ్య, కోశాధికారిగా బాదె శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా రాజయ్య, ముష్క శ్రీనివాస్, యాదగిరితో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కమిటీని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు ప్రకటనలో పేర్కొన్నారు.

కార్యాలయాలన్నీ ఒకే చోట

(5వ పేజీ తరువాయి)

బిల్డింగ్ నిర్మించాలని సంకల్పించారు. ప్రభుత్వం రూ.4.50 కోట్లతో భవనాన్ని జీప్లస్-2 నమునాలో మంజూరు చేయించారు. భవన నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ శాఖ నిర్మించే భవన నిర్మాణానికి పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు.

ఆధునిక హంగులతో భవన నిర్మాణం..

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మాదిరిగా అన్ని ఆధునిక హంగులతో 18 ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలను ఒకే చోట నిర్వహించడానికి ఈ ఇం టిగ్రేటేడ్ భవనాన్ని నిర్మిస్తున్నారు. సుమారు 15 గుం టల్లో జీప్లస్-2 మోడల్‌లో భవనాన్ని నిర్మించనున్నారు. డివిజన్, మండల స్థాయిలో 18 శాఖల ఆఫీసుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా గదులను నిర్మించను న్నారు. ఉద్యోగుల కార్యాలయ నిర్వాహణ, పనుల నిమిత్తం వచ్చే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని భవనాన్ని నిర్మిస్తున్నారు. భవనంలో మీటింగ్ హాల్, వీడియో కాన్ఫెర్స్ హాల్, పబ్లిక్ వెయిటింగ్ హాల్, పార్కింగ్, పబ్లిక్ టాయిలెట్స్, గ్రీనరీ స్పేస్ ఇలా అనేక సౌకర్యాలతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవనంతో మంథనికి నూతన కళ వచ్చే అవకాశం ఉంది. మరో ఏడాదిలో భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ దివ్యదర్శనరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో రానుందని, అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, సవరణలు, నూతన ఓటర్ల నమోదు పరిశీలించాలన్నారు. ఇంటి పన్నులను సక్రమంగా వసూలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. ఎంపీఓ సమ్మిరెడ్డి తోపాటు పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కోతుల నుంచి రక్షణ కల్పించాలి

కమాన్‌పూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేటలో కోతుల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఎంపీడీఓకు గురువారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కోతులు గుంపులుగా ఇళ్లలోకి దూరడంతోపాటు చెట్లు, కూరగాయల మొక్కలు ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. పలువురిని గాయపరుస్తున్నాయని, ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే మందులు లేవని, ప్రైవేటుకు పంపిస్తున్నారని పేర్కొన్నారు. కోతులను పట్టి అటవీ ప్రాంతంలోకి తరలించాలని కోరారు. కొండ వెంకటేష్, పల్లె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌ను పరామర్శించిన నాయకులు

కమాన్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈర్ల సురేందర్ కుమారుడు ఈర్ల విశ్వతేజ ఇటీవల మృతి చెందాడు. గురువారం మండల అధ్యక్షుడు అన్వర్‌తోపాటు పలువురు పెద్దపల్లిలోని వారి స్వగృహంలో పరామర్శించి విశ్వతేజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రంగు సత్యనారాయణ, ఇక్బాల్,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు దాసరి గట్టయ్య, రఫీక్, గడప కృష్ణమూర్తి, మహేష్, భూంపెల్లి రాజు పాల్గొన్నారు.

యువత ప్రజాసేవలో ముందుండాలి

కమాన్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత ప్రజాసేవలో ముందుండాలని ఎస్ఐ కొట్టెప్రసాద్ అన్నారు. గురువారం కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామశాఖ అధ్యక్షుడు చిగురు రవీందర్, సభ్యుల బృందం ఎస్ఐని సన్మానించారు. గ్రామ స్థాయిలో యూత్ కాంగ్రెస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, యువత సమస్యలు, ప్రజాభద్రత ఎస్ఐకి వివరించారు. ఆయన మాట్లాడుతూ యువతకు అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. గడ్డం రాజమహేందర్, లింగాల రాజేందర్, గుమ్మడి రాజ్ కుమార్, మహేష్, రమేష్, నాగపురి అజయ్, బూస నరేష్, అభిరాం ఉన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

పాలకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుక్కలగూడూర్, పుట్నూర్ గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పర్యటించారు. కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సీపతి శంకరయ్య గౌడ్ అనారోగ్యానికి గురికావడంతో ఆయనను కలిసి వైద్యం చేయిస్తానని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గుడిపెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో శశికళ పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, నాయకులు బొంతల రాజేష్, శంకరయ్య, మునీర్, సీపతి సురేష్ పాల్గొన్నారు.

గాయత్రి సేవా సమితి అన్నదానం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అమావాస్య అన్న ప్రసాద కార్యక్రమంలో భాగంగా దాతలు తొడుపునూరి రాధ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వెంకటేశం, శ్రీనివాస్ నిర్వహించారు. 28 నెలలుగా దాతల సహకారంతో కొనసాగుతున్నదని నిర్వాహకుడు కాసనగొట్టు వినయ్ తెలిపారు. సేవా సమితి సభ్యులు రావికంటి రాజు, చిట్టమల్ల రవి, పైడా నరేందర్, కటకం సత్యనారాయణ, ముస్త్యాల ప్రదీప్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



రోడ్డుపై కారు నిలపడంతో వాహనదారుల ఇబ్బందులు

ధర్మారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నడిరోడ్లపై వాహనాలు పార్కు చేస్తూ కొందరు బాధ్యత రాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా కూడలిలో రోడ్డుపై ఓ వ్యక్తి కారు నిలపి సమీపంలో పండ్లు కొనడానికి వెళ్లాడు. జగిత్యాల నుంచి వచ్చిన బస్సు ధర్మారం బస్టాండ్ లోపలకి వెళ్లేందుకు స్థలం లేక హారను కొడుతూ కారు డ్రైవర్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సు వెనకాల వచ్చిన వాహనాలు సైతం నిలిచిపోయాయి. కారు డ్రైవర్ తీరిగ్గా పండ్లు కొనుక్కొని వచ్చి కారు తీశాడు. నిబంధనలకు విరుద్ధంగా కారును పార్క్ చేశాననే పశ్చాతాపం అతనిలో కనబడక పోవడంతో ప్రజలు తలో మాటతో బుద్ధి చెప్పారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గం

ఎలిగేడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అధ్యక్షతన గురువారం జరిగింది. మండల అధ్యక్షుడిగా కనుకుంట్ల నారాయణ, గౌరవ అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షులుగా కవ్వంపల్లి శ్రీనివాస్, గుర్రం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శిగా రాజమౌళి, తీట్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా దేవండ్ల శివ, కోశాధికారిగా ఉపేంద్ర, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీనర్సయ్య, లచ్చయ్య, లింగయ్య, మనిరెడ్డి, తిరుపతి, ఆకుదారి భూమయ్య ఎన్నికైనట్లు ప్రకటించారు.

ధర్నాను విజయవంతం చేయండి

పెద్దపల్లిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) వ్యవసాయ కార్మిక సంఘం (సీఐటీయూ), రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గణేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా చేపట్టినట్లు తెలిపారు.

మైసమ్మ గుడులు కూల్చిన వారిపై కేసు నమోదు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందర్

గోదావరిఖని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో దారి మైసమ్మ గుడులు కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుళ్ల కూల్చివేతల్లో బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి భక్తుల మనోభావాలను కాపాడాలని, ఈ నెల 25వ తేదిలోగా కూల్చిన గుళ్ల స్థానంలో 46గుళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే మళ్లీ ఇలాంటి ఘటనలే జరుగుతాయని, దీనిపై ఎమ్మెల్యే స్పందించాలన్నారు. గాంధీనగర్, ఎన్‌టీపీసీ, చౌరస్తాల్లో వ్యాపార సముదాయాలు కూల్చివేయడం వల్ల ఎందరో చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారని, సింగరేణి ఆధ్వర్యంలో చేపడుతున్న దుకాణాల సముదాయాలను చిరు వ్యాపారులకు ఉచితంగా అందించాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోపు ఐలయ్య, బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజు, గాదం విజయ, కృష్ణవేణి, అంజలి, జనగామ కవిత, అచ్చె వేణు, జక్కుల తిరుపతి, దొమ్మేటి వాసు, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) పెద్దపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే విజయ రమణరావు, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌లకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శివాజి మహారాజ్ మతాలకు అతీతంగా అందరినీ ఒకే తాటికి తెచ్చిన వీరుడని, నీతికి న్యాయానికి కట్టుబడి ఉన్న సేవకుడని, అలాంటి మహావీరుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర రావు, పోల్సాని సంపత్ రావు, రమేష్, పెంజర్ల రాకేష్, మేకల శ్రీనివాస్, తిరుపతి, కావేటి రాజగోపాల్,ఈర్ల శంకర్,ఎర్రోళ్ల శ్రీకాంత్, రాజన్న పటేల్ పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

కమాన్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షుడు తోట రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వ పరంగా కాకుండా పార్టీ పరంగా ఇద్దామనడం దుర్గమమైన చర్య అన్నారు. బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే పార్టీలకతీతంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీలంతా ఒక్కటై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల్లో ఓడిస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు

పెద్దపల్లిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు ఉమ్మల్ల రాజేందర్ ఆరోపించారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో వివరాలను వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అనర్హులకు మంజూరు చేశారని ఆరోపించారు. దీనిపై ఇందిరమ్మ కమిటీ సభ్యులను కోరగా ఎమ్మెల్యే ఎంపిక చేశారని, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవోను అడగాలని తెలిపారన్నారు. ఎంపీడీవోను అడిగితే కమిటీ సభ్యులకే తెలుసని దాటవేస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు కమిటీ సభ్యులుగా ఉన్న వారు ఇళ్లు కేటాయించుకున్నారన్నారు. నిజమైన నిరుపేదలను గుర్తించి, రీసర్వే చేయించి అర్హులకు ఇండ్లు మంజూరయ్యేలా కలెక్టర్, ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని కోరారు.

కేటీఆర్‌పై విచారణ సరికాదు

పెద్దపల్లిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌పై చార్జిషీట్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై బీఆర్ఎస్ నాయకులు ఆకుల స్వామి, వివేక్ పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేకే కాంగ్రెస్ కుట్రలు చేస్తోందన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రతిపక్ష నేతలపైకేసులు పెడుతున్నారన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

పెద్దపల్లి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తుర్కలమద్దికుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బాలికల కోసం అత్యాధునిక సౌకర్యాలతో కూడిన టాయిలెట్ల నిర్మాణ పనులకు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల శంకుస్థాపన చేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సీఈవో మల్కా యశస్వి ఆధ్వర్యంలో ఉన్న దాస్ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ సొంత నిధులు దాదాపు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే పనులను గురువారం ప్రారంభించినట్లు సభ్యులు తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులపై సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ఉపాధ్యాయులు, దాస్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

టాయిలెట్స్ డే సందర్భంగా

కోల్‌సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఉన్న ప్రజా మరుగుదొడ్డి ఆవరణను గురువారం నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది, స్వశక్తి మహిళలు, మెప్మా సిబ్బంది శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలో ముగ్గులు వేసి అలంకరించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. రామగుండం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సంపత్, శానిటరీ జవాన్లు అశోక్, దయానంద్, మెప్మా సీఓ శమంత పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూడళ్లలో, రోడ్డు పక్కన ఉంటున్న అనాథలు, యాచకులకు గురువారం రాత్రి యువ సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను అందజేశారు. బస్టాండ్, పలు ప్రదేశాల్లో నివసిస్తూ చలిలో ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లను పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్ తెలిపారు.

పాలకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జయ్యారం సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన స్వెటర్లు, బ్లాంకెట్లను గురువారం వసతి గృహ సంక్షేమ అధికారి మెండె సంపత్ కుమార్ పంపిణీ చేశారు.

కొండెక్కిన కోడిగుడ్డు

కళ్యాణ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. నిన్నటి వరకు రూ.5 నుంచి రూ.6 ఉంది. ఒక్కసారిగా హోల్‌సేల్ ధర రూ.7.5పలుకుతుండగా రిటైల్ రూ.8.50కి విక్రయిస్తున్నారు.దీంతో సంక్షేమ పాఠశాల, ఆసుపత్రుల్లో గుడ్లను అందించాలంటే కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. ఒక కేస్ ధర రూ.225పలుకుతుంది.

యువకుడి రక్తదానం

పెద్దపల్లి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గ్రామానికి చెందిన శ్రావణ్ రక్తదానం చేశాడు. కోరుట్లకు చెందిన మహిళకు పాముకాటు వేయగా అత్యవసర పరిస్థితి లో రక్తం అవసరం ఉందని పెద్దపల్లి జిల్లాకు చెందిన సముద్రాల రాజ్‌కుమార్‌కు సంప్రదించారు. శ్రావణ్‌తో రక్తదానం చేయించారు. వేల్పుల వెంకటేష్, విద్యాసాగర్‌లు ఉన్నారు.

బడి బయట పిల్లల సర్వే



సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 30 వరకు పాఠశాలలకు వెళ్లకుండా ఉండే పిల్లలను సీఆర్‌పీలు, ఐఆర్‌పీల ద్వారా గుర్తించే కార్యక్రమాన్ని గురువారం చేపట్టినట్లు ఎంఈఓ సురేందర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బడి బయట ఉండటానికి గల కారణాలతో ప్రభంద్ పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. వారు పట్టణంలోని బండారికుంటలో పిల్లల సర్వేను పెద్దపల్లి క్లస్టర్ సీఆర్‌పీ బాలసాని వెంకటేశంతో కలిసి ఎంఈఓ సర్వే నిర్వహించారు.



ఖనిజాభివృద్ధి కమిటీలో సింగరేణి చైర్మన్

గోదావరిఖని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న కీలక ఖనిజాలను గుర్తించడం, ఉత్పత్తికి జాతీయ స్థాయి కమిటీని నీతి ఆయోగ్ ఈనెల 19న నియమించింది. ఈ కమిటీకి చైర్మన్‌గా ఐఐటీ-ఐఎస్ఎం సంస్థ అడ్వైజర్ (మినరల్స్) డాక్టర్ డీకేసింగ్‌ను, కమిటీ సభ్యులుగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్ (ఐఎంఎంటీ) డైరెక్టర్, సింగరేణి సంస్థ చైర్మన్ బలరాంతో పాటు నైవేలీ లిగ్నైట్ కంపెనీ, కోల్ ఇండియా, గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పలు పరిశ్రమల విభాగాల నుంచి ఆరుగురిని సభ్యులుగా నియమించారు.

నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత ప్రోత్సహించే విధంగా ఈ కమిటీ చురుకుగా పనిచేయాలని సూచించింది. కీలక ఖనిజాల ఉనికి నిర్ధారించబడినట్లైతే, పరిశ్రమల వారు సొంతగా లేదా ఉమ్మడి భాగస్వామ్యంతో, ఇతరులతో కలిసి ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై లోతుగా అధ్యయనం చేసి సంపూర్ణ నివేదికను 12నెలల లోగా సమర్పించాలని నీతి ఆయోగ్ కోరింది. సింగరేణి సంస్థ కీలక ఖనిజాల రంగంలో ముందుకు సాగుతున్న నేపథ్యంలో, సింగరేణి చైర్మన్‌ను జాతీయ కీలక ఖనిజాల కమిటీలో సభ్యునిగా నియమించారు.

ఆర్జీ-3లో పర్యటించిన కార్పొరేట్ జీఎం

రామగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో కార్పొరేట్ జీఎం(సిహెచ్‌పి) ఎస్.వి మూర్తి గురువారం పర్యటించారు. పదవీ బాధ్యతలు స్వీకరించి ఆర్జీ-3 డివిజన్‌లో పర్యటిస్తున్న సందర్భంగా జీఎం కార్యాలయంలో పూల మొక్కను జీఎం సుధాకర్‌రావు అందజేసి సన్మానించారు. అనంతరం సిహెచ్‌పిని సందర్శించారు. అధికారులు శేఖర్‌బాబు, కాశీవిశ్వేశ్వర్‌రావు వివిధ విభాగాల హెడ్స్ పాల్గొన్నారు.

ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారిగా రాజశేఖర్

రామగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2 ప్రాజెక్టు అధికారిగా రాజశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి సాంబయ్య స్వాగతం పలికి సన్మానించారు. నాయకులు వెము రవీశంకర్, చిప్ప సురేష్, పింగిళి సంపత్‌రెడ్డి, వీరగొని సంతోష్‌గౌడ్, బర్లసుధాకర్, దేవశ్రీనివాస్, రమేశ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమానికి సిద్ధంకావాలి



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

గోదావరిఖని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగనులు ఇవ్వకుండా, ఉన్న బావులను అమ్మకాలకు పెడుతూ సింగరేణికి మనుగడ లేకుండా చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాల వల్ల పెనుప్రమాదం నెలకొందని వివిధ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం అడ్డగుంటపల్లిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో టీబీజీకేఎస్ నాయకుడు మాదాసి రామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో తుమ్మల రాజిరెడ్డి (సీఐటీయూ), జే.సీతారామయ్య (ఐఎఫ్‌టీయూ) కామేరా గట్టయ్య (టీఎస్‌యూఎస్), మనిరాం సింగ్ (టీఎన్‌టీయూసీ), కే విశ్వనాథ్ (ఐఎఫ్‌టీయూ), పోచమల్లు (ఏఐఎఫ్‌టీయూ), మహేందర్ (ఎస్‌జీకేఎస్)లు మాట్లాడారు. యాజమాన్యం కార్మికుల ఉద్యోగాలను తొలగించేందుకు 150 మస్టర్ల పేరుతో, నిర్బంధ సర్క్యులర్లతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. సింగరేణిని పరిరక్షణకు ఉద్యోగాలు, నిర్బంధ సర్క్యులర్ల రద్దుకు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో కొత్త బావులకు అనుమతించకుండా ఉన్న బావులను వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. సింగరేణి కాపాడుకునేందుకు కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు.

25న ఉద్యమ రూపకల్పన

కార్మిక సంఘాల ఐక్య సమావేశంలో ఈనెల 25న గోదావరిఖనిలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీలను భాగస్వాములను చేసేందుకు మరోసారి ప్రయత్నం చేయాలని కార్మిక సంఘాల నిర్ణయించారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఐ కృష్ణ, రాజమౌళి, నీరటి రాజయ్య, జీ రాములు, నిమ్మకాయల ఏడుకొండలు, నరేష్, దామోదర్ రెడ్డి, వెంకటస్వామి, కొండి శ్రీనివాస్, కుమారస్వామి, రత్నకుమార్, ఐ రాజేశం, డీ లక్ష్మణ్, ఏ సంజీవ్, ఎంఏ బేగ్, రాయపోచం, బీరాంచందర్ పాల్గొన్నారు.

మహిళా బదిలీ వర్కర్లకు ఆఫీస్ ఆర్డర్ల అందజేత

యైటింక్లయిన్‌కాలనఈ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3లో పని చేస్తున్న మహిళా బదిలీ వర్కర్లకు గురువారం ప్రాజెక్టు మేనేజర్ భరత్ కుమార్ జనరల్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఆర్డర్లను అందజేశారు. అండర్ గ్రౌండ్‌లో 190 మస్టర్లు, సర్ఫేస్‌లో 240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లకు జనరల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఐదుగురు మహిళా బదిలీ వర్కర్లకు ఆర్డర్లు అందించినట్లు మేనేజర్ తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని వారికి మేనేజర్ సూచించారు. పిట్ ఏఐటీయూసీ సెక్రెటరీ మహేందర్, అధికారులు సాయికృష్ణ, అజీజ్ పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఉద్యోగుల చేయూత

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1లో ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వేగోళపు శ్రీనివాస్ కుటుంబానికి ప్రాజెక్టు ఉద్యోగులు ఆర్థిక చేయూతనందించారు. రిలే-సీ ఉద్యోగులు రూ. 34,700, సర్వే డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు రూ.10,700 తమవంతు సాయంగా అందించారు. గురువారం ప్రాజెక్టు మేనేజర్ పాపాయ్య గురువారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ.45,400 నగదును అందజేశారు. శ్రీనివాస్ వైద్య సహాయానికి స్పందించి సాయం చేసిన ఉద్యోగులను మేనేజర్ ప్రశంసించారు.

అతిథిగృహం కార్మికులకు దుస్తుల పంపిణీ

రామగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రామగిరి అతిథి గృహంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు గురువారం ఐఎఫ్‌టీయు నాయకుడు ఆకుల వెంకన్న చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేపట్టారు. కేర్ టేకర్ మేకల రాంచందర్, నాంసాని సునీల్‌కుమార్, రవి, ధర్మల వెంకటేష్, పున్నం మణితేజ, శ్యామ్, మనోహర్, స్వామి, రుక్మిణి, లక్ష్మి, స్వప్న, రాజేశ్వరి పాల్గొన్నారు.